ప్రజాశక్తి
బుధవారం 1 జనవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

7590 మందికి ప్రయోజనం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు



మధ్యాహ్న భోజనం కోసం కొనుగోలు చేసిన ప్లేట్లు, గ్లాసులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 3 నుంచి జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి రానుంది. సమీప పాఠశాలల నుంచి జూనియర్ కాలేజీ విద్యార్థులకు భోజనాలను ఆటోల్లో పంపించనున్నారు. ఈ రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లించనుంది. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతో జిల్లాలోని 7590 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వాటిలో వివిధ సెక్షన్లలో 7590 మంది విద్యార్థులున్నట్లు ఇంటర్ విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆయా కాలేజీల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మ్యాపింగ్ చేసిన ప్రభుత్వ పాఠశాలల నుంచి వండిన భోజనాలు రానున్నాయి. కాలేజీ విద్యార్థుల భోజనాలకు ప్లేట్లు, గ్లాసులను ప్రభుత్వం అందజేయనుంది. కాలేజీలకు అదనపు భారం లేకుండా వంటల బాధ్యతను పాఠశాలల నిర్వాహకులకు అప్పగించింది. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని జూనియర్ కాలేజీల్లో నాలుగు నుంచి మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి రానుంది. ఆమె చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతో విద్యార్థులు తమ ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తీసుకురావాల్సిన అవసరం తగ్గుతుంది. ఇంటర్‌లో విద్యార్థులు చదువు మధ్యలో మానేయడంతో ఆ సంఖ్యను తగ్గించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించినట్లు ప్రభుత్వం చెబుతోంది.




నూతన సంవత్సర జోష్

విశాఖ నగరంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం నుంచే యువత సందడి చేశారు. 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు సాగాయి. సినీ గీతాలకు డ్యాన్సులు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రంగులు పూసుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులతో నగర పరిసరాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

కార్గోలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

60 మిలియన్ మెట్రిక్ టన్నులతో 91 ఏళ్ల చరిత్రను తిరగరాసిన వైనం



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు త్రైమాసికాల్లో 60 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను నిర్వహించడం ద్వారా 91 ఏళ్ల పోర్టు చరిత్రలో ఒక సువర్ణ ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ విషయాన్ని విపిఎ కార్యదర్శి టి.వేణు గోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24లో మొదటి మూడు త్రైమాసికాల్లో చేసిన 59.73 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించి నూతన రికార్డును పోర్టు నెలకొల్పిందని, సమిష్టి కృషి, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునిక లాజిస్టిక్స్, ఆపరేషనల్ వ్యవస్థల సమన్వయంతోనే ఈ అనూహ్య విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త 100 ఎమ్‌టి క్రేన్ ఏర్పాటు, విసిటిపిఎల్ ద్వారా యంత్రాంగాన్ని మెరుగుపరచడం, వేగవంతమైన కార్గో నిర్వహణ కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తేవడం, సాంకేతిక సదుపాయాల్లో భాగంగా రియల్ టైమ్ కార్గో మానిటరింగ్ కోసం, డ్యాష్ బోర్డ్ అనలిటిక్స్, కార్యాచరణ సమర్థత కోసం సమన్వయ వ్యవస్థల ఏర్పాటు నూతన రికార్డుకు దోహదపడ్డాయన్నారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన సిబ్బందిని, భాగస్వాములను పోర్టు ఛైర్మన్ డాక్టర్ మిగతా 2లో..

హామీల అమల్లో బాబు విఫలం



మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు ఆరు నెలల పాలనంతా వంచన, మోసంతో సాగిందని, హామీలను అమలు చేయడంలో ఘోరంగా ఆయన విఫలమయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మంగళవారం ఉదయం మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను బాబు మోసం చేశారన్నారు. గడిచిన ఆరు నెలల్లోనే లబ్ధిదారులకు రూ.60 వేల కోట్లు బకాయి పడ్డారని తెలిపారు. 2024లో రెండు ప్రభుత్వాల పాలనను ప్రజలు గమనించారని, ఎవరి పాలన ఎలా ఉందనేది వారికి స్పష్టంగా తెలిసిందని అన్నారు. ఆనాడు రాష్ట్రం శ్రీలంక అయిందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఆయన నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే ఏకంగా రూ.1.12 లక్షల కోట్ల అప్పు చేసిందని, దేశంలోనే ధనిక సిఎం చంద్రబాబు అని ఎడిఆర్ రిపోర్టు బయటపెట్టిందని అన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై వైఖరిని వెల్లడించాలి

ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్గోలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ఎం.అంగముత్తు అభినందించారు. ఈ రికార్డు పోర్టుకు దేశ వాణిజ్యాభివృద్ధిలో ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. పోర్టు యాంత్రీకరణ, బహుముఖ మౌలిక వసతుల కల్పన ద్వారా వివిధ మార్గాలను అనుసంధానం చేసే పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్టు పేర్కొన్నారు. అందుకోసం 10 లైన్ల రహదారుల విస్తరణ, అంతర్గత ఫ్లైఓవర్ల నిర్మాణం, ప్రస్తుత టెర్మినల్స్ ఆధునికీకరణ. వంటి పనులను శీఘ్రగతిన చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టులు పోర్టును సముద్ర వాణిజ్యంలో మరింత బలోపేతం చేయడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

హామీల అమల్లో బాబు విఫలం

కూటమి వైఖరి ఏమిటో చెప్పాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. జనవరి 8న స్టీల్‌ప్లాంట్‌పై ప్రధానితో స్పష్టమైన ప్రకటన చేయించాలన్నారు. ఆఖరుకు ఉక్కు నాయకులు స్థానిక ఎంపీ భరత్‌ను కలిసినప్పుడు ఉద్యోగులకు జీతాలు అందడం లేదా ? అని అంటున్నారంటే కార్మికుల పట్ల వారి చిత్తశుద్ధి ఏంటో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఇద్దరే ఇద్దరు ఎంపీలతో జెడిఎస్ కర్నాటకలో స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు కేటాయించుకుంటే.. 21 మంది ఎంపీలతో కేంద్రంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేరా..? ఆంధ్రుల హక్కుగా ఉన్న స్టీల్ ప్లాంట్ కోసం అల్టిమేటం ఇవ్వలేరా ? అని ప్రశ్నించారు.

ముగిసిన వింటర్ చెస్ క్యాంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో తలపెట్టిన అంతర్జాతీయ ప్రమాణాలుగల వింటర్ చెస్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఆశీల్‌మెట్ట ఎసెంట్ జూనియర్ కాలేజీలో జరిగిన ఈ శిక్షణా శిబిరంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన రవి, అఖిల్, రుత్విక్‌లను ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ స్థాయి అనుభవం కలిగిన ఫిడే ట్రైనర్ కేశవానంద 50 గంటల పాటు 4 రోజుల ఇంటెన్సివ్ శిక్షణ అందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 53 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. 6 సంవత్సరాల పిల్లల నుండి 60 సంవత్సరాల పెద్దలు వరకు ఈ చెస్ క్యాంపునకు హాజరయ్యారు. కామన్‌వెల్త్ అండర్ 12 సిల్వర్ మెడల్ విజేత అఖిల్ ప్రసాద్, జి.రవికృష్ణ, ఫిడే రేటింగ్ టోర్నమెంట్ విజేత ఎంవి.రుత్విక్ తదితర ఆటగాళ్ళు ఈ ప్రతిష్టాత్మక శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ఎమ్‌డి ఆఫ్ అసెంట్ క్లాసెస్ డాక్టర్ ఉమాధర్ పట్నాయక్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మల్ల శర్వాని, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీ హర్ష అవార్డులు అందజేశారు. యులోజికా సిఇఒ రాజు చిత్రాడ, విజయలక్ష్మి పతకాలు, సర్టిఫికెట్లను అందించారు.



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకుని మంగళవారం నగరంలోని జోన్ -1, జోన్- 2 పరిధిలో 136 టీంలతో 162 లాడ్జిలు, హోటళ్లు, 62 హాస్టళ్లలో తనిఖీలు చేపట్టారు. ఎన్ఒసిలు, ట్రేడ్ లైసెన్సులు, జిఎస్‌టి సర్టిఫికెట్లు ఉన్నాయా ? లేదా ? అన్న విషయంపై విచారణ సాగించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎంవిపి పోలీస్ స్టేషన్‌ను డిసిపి-1 అజిత వేజెండ్ల తనిఖీ చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో బీచ్ రోడ్డులో పోలీసుల నిఘా పెరిగింది.

ప్రగతి పథంలో జివిఎంసి

మీడియా సమావేశంలో మేయర్ హరి వెంకట కుమారి



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గడిచిన ఏడాది కాలంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి పథంలో నడిచిందని, పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేసామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం జివిఎంసి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో గడిచిన ఏడాది కాలంలో రూ.185.21 కోట్లతో 813 పనులు చేపట్టగా అందులో 197 పనులు పూర్తయ్యాయని, రహదారుల విభాగంలో రూ.5.28 కోట్లతో రోడ్డు మరమ్మతులకు సంబంధించి 2,771 ప్యాచ్ హోల్స్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.36.33 కోట్లతో ఐదు స్టేడియాల పనులు పురోగతిలో ఉన్నాయని, రూ.10.53 కోట్లతో ఆరు శ్మశాన వాటికలకు మరమ్మతులు చేపట్టగా అందులో ఒకటి పూర్తయిందని, ఐదు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రూ.17.43 కోట్లతో 9 థీమ్ పార్కుల పనులు చేశామన్నారు. రూ.672 కోట్లతో 58 స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, మరొక మూడు ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నీటి సరఫరాకు రూ.666.22 కోట్లను కేటాయించామన్నారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. అమృత భారత్ పథకంలో భాగంగా 27 ప్రాజెక్టులకు రూ.356.42 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి రూ.150 కోట్లతో పిపిపి పద్ధతిలో ఒక ప్రాజెక్టు పూర్తయిందని వెల్లడించారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో 1500 మంది పారిశుధ్య కార్మికులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. వీధి కుక్కలు, దోమల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టిందీ మేయర్ వెల్లడించారు. ఇప్పటివరకూ 2496 టిడ్కో ఇళ్లను పూర్తి స్థాయిలో నిర్మించి 1940 మందికి అందించినట్టు తెలిపారు. 1,31,627 మందికి ఒక సెంటు ఇళ్ల పట్టాలను అందజేశామన్నారు. 13,326 స్వయం సహాయక సంఘాలకు రూ.730.67 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామన్నారు.

2024 లో పొందిన అవార్డులు

ప్రజా ఆరోగ్య విభాగంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 - 24కిగాను జాతీయ స్థాయిలో నాలుగో స్థానం లభించిందని తెలిపారు. స్వచ్ఛత భాగిదారి పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించిందని చెప్పారు. పిఎం స్వనిధి పథకానికిగాను రాష్ట్ర వ్యాప్తంగా మొదటి స్థానం లభించిందని, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకుగాను బెస్ట్ పబ్లిక్ అవేర్‌నెస్ ప్రోగ్రాం క్యాటగిరీలో ప్రథమ స్థానం లభించిందని తెలిపారు. సమావేశంలో కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో మూడేళ్ల కాల పరిమితికి స్టాండింగ్ కౌన్సిల్ నియామకం కోసం జివిఎంసి కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్ ఎస్‌సిలకు, మహిళలకు అన్యాయం చేసేదిగా ఉందని సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ అన్నారు. ఈ నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని, లేదా సరిచేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసిలో 1/2019 సర్క్యులర్‌ను పూర్తిగా అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి బాధిత ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నగర పరిధిలోని ఆర్‌టిసి డిపోల ఎదుట ఎపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాలు నిర్వహించారు. భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు.

రక్షణ దళాల సిబ్బంది శిక్షణకు సహకారం

- ఎన్‌సిసి, ఆర్‌ఎస్‌బిలతో గీతం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : దేశ రక్షణ దళాలలో ప్రస్తుతం పనిచేస్తున్న, ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రత్యేక శిక్షణ అందించడానికి ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్, పశ్చిమబెంగాల్‌కు చెందిన రాజ్య సైనిక్ బోర్డు (ఆర్‌ఎస్‌బి)లతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మంగళవారం గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్‌సిసి డిప్యూటీ డైరక్టర్ జనరల్ కల్నల్ సమీర్ శర్మ, పశ్చిమబెంగాల్ రాజ్య సైనిక్ బోర్డు కార్యదర్శి కల్నల్ పార్ధ ప్రతిమ్ బారిక్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా గీతంవర్సిటీ ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యుజిసి, ఎఐసిటిఇ అనుమతులతో వివిధ మేనేజ్‌మెంట్ కోర్సులను గీతంలో నిర్వహిస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులకు శిక్షణ ఇవ్వడానికి ఏటా సిలబస్‌లో కొత్త అంశాలను చేర్చుతున్నామని వెల్లడించారు. ఎన్‌సిసి డిప్యూటీ డైరక్టర్ జనరల్ కల్నల్ సమీర్‌శర్మ మాట్లాడుతూ రక్షణ దళాలలో పనిచేస్తున్న వారు 30 నుంచి 40ఏళ్ల వయస్సులో ఉద్యోగవిరమణ చేస్తారని, తరువాత వేరే ఉద్యోగాలు పొందేందుకు వీలుగా వీరికి సరైన నైపుణ్యశిక్షణ అవసరమైన నేపథ్యంలో గీతం వర్సిటీ సహకారాన్ని కోరుతున్నామని తెలిపారు. పశ్చిమబెంగాల్ ఆర్‌ఎస్‌బి కార్యదర్శి కల్నల్ పార్ధ ప్రతిమ్ బారిక్ మాట్లాడుతూ రక్షణ దళాలలోని వివిధ విభాగాలలో పనిచేసిన వారికి ఆర్ధిక అంశాలపైన, అకౌంటింగ్, హెచ్‌ఆర్‌ఎమ్, హస్పిటల్ మెనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన ఉంటుందని, వారికి ఎంబిఎ, బిబిఎ కోర్సుల్లో గీతంలో శిక్షణనివ్వాలని కోరారు.

కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిప్పు మాట్లాడుతూ రక్షణ దళాల సిబ్బందికి, విశ్రాంతి ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేకదృష్టి పెట్టామని, దీనికోసం అంతర్గత కమిటీని నియమించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక, ఐక్యుఎస్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాప్రభు, గీతం మానవ వనరుల విభాగం అధిపతి (విఎస్‌ఎమ్) జి.వి.సత్యంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఆనందపురం: ముచ్చర్లను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. నూరు శాతం టిడిపి సభ్యత్వాలు సాధించిన ముచ్చర్ల గ్రామ ప్రజలను అభినందించారు. ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని గిడిజాల, ముచ్చర్లలో పెన్షన్ల పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపిడిఒ జానకి, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, నాయకులు శివ, బిఆర్‌బి.నాయుడు, గంధ్రెడ్డి సోంబాబు, తాత్రాజు అప్పారావు, బమ్మిడి ఉమా, అప్పల నారాయణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని వి.సంతపాలెం గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను మంగళవారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మండల ప్రత్యేకాధికారి పూర్ణిమా దేవి, టిడిపి నాయకులు కసిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, రొంగలి మహేష్, బొడ్డు అక్కు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 59వ వార్డు కొత్త నక్కవానిపాలెం గ్రామంలో జివిఎంసి నిధులు 14.80 లక్షలతో పలు అభివృద్ధి పనులకు జనసేన నాయకులు పుర్రె సురేష్ యాదవ్, కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్యే గణబాబు సహకారంతో రానున్న రోజుల్లో వార్డుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీను జనసేన వార్డు అధ్యక్షులు కోటా శ్రీనివాసరావు, నాయకులు ఉరుకూటి హరిబాబు, ఉరుకూటి మహేష్, గ్రామ గౌరవాధ్యక్షులు కిలాడి పైడిరాజు, ఉరుకుటి బంగారు రాజు, తుట్టా శ్రీను, వెంకటరావు, మహిళలు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షురాలిగా నాగమణి

ప్రజాశక్తి పద్మనాభం : బిజెపి మండల అధ్యక్షురాలిగా తమటపు నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పూర్వ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు కేశవ్ కాంత్, ఎన్నికల అధికారి రిటైర్డ్ జడ్జి సన్యాసిరావు, ఆర్ఒ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించి, నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు. నాగమణిని బిజెపి వైద్యవిభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్,ఉప్పాడ అప్పారావు, పివివి ప్రసాదరావు పట్నాయక్, పాలూరి కృష్ణారావు, సిరిపురపు వెంకటరావు, కళింగపట్నం అప్పన్న, గుడివాడ నరసింహులు, కలగర్ల పేర్రాజు, మత్స సోమేశ్వరరావు, జొన్నాడ గౌరీ అప్పారావు, శివ నాని ఎల్లారావు తదితరులు అభినందించారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస: విపత్తుల నిర్వహణపై చిట్టివలస బొగ్గు రోడ్డులోని శ్రీకృష్ణా జూనియర్, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం అవగాహన కల్పించారు.చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఛాతి నొప్పి, స్పృహ తప్పి పోవడం, మూర్ఛ, ఇంట్లో వంటగ్యాస్ లీకైతే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు.సత్యసాయి సేవా సంస్థల డిజాస్టర్ మేనేజ్మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్, లక్ష్మి అవగాహన కల్పించారు.కళాశాల చైర్మన్ బి నరసింగరావు అధ్యక్షతన జరిగిన సమితి కన్వీనర్ గొట్టి పల్లి సత్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి పలువురి పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : కుమార్తె కాపురం కుదుటపడక పోవడంతో తీవ్రంగా కలత చెంది బలవన్మరణానికి పాల్పడ్డ మండలంలోని టి నగరపాలెం పంచాయితీ, గొల్లల పాలెం గ్రామానికి చెందిన బొట్టా శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు (వాసు రాజు) , పలువురు సర్పంచ్ లు, వైసిపి నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని మృతుని భార్య, కుమార్తెకు భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, టి నగరపాలెం, అన్నవరం వైసిపి నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, ఎల్లాజీ, దాకమర్రి ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబు, మజ్జిపేట సర్పంచ్ మజ్జి సూరినాయుడు ఉన్నారు.

అలాగే మృతుని కుటుంబాన్ని టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్, ఎస్‌సి సెల్ నాయకులు పతివాడ రాంబాబు, పరామర్శించారు

సిఐటియు నేతల పరామర్శ

మృతుని కుటుంబాన్ని సిఐటియు నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎస్ అప్పల నాయుడుతో పాటు ఆటో కార్మిక సంఘం నాయకులు నీలాతి రాము, పల్లా పోతురాజు, పెంటరాజు తదితరులు పరామర్శించారు

ఉక్కు అధికారికి ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి -ఉక్కు నగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి, ఉక్కు సెంట్రల్ స్టోర్స్ విభాగంలో డిజిఎం (ఎంఎం)గా మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన కె. వేణుగోపాల్‌ను స్టీల్ ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వేణుగోపాల్‌కు దుశ్శాలువా వేసి, జ్ఞాపికతో సన్మానించారు. సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ ఎన్.వీరేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు మోతుకురి వేణుగోపాల్, జె.శ్రవణ్ కుమార్, జి. మల్లేశం, ఎన్..నర్సింగరావు, ఆర్.నరసింహ, సందీప్, రంజిత్, పరమేష్ , సిహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న తెలంగాణ ఉద్యోగులు

హిందీ పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డులోని 39 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం హిందీ పుస్తకాలు అందజేశారు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామ చంద్రమూర్తి ఆర్థిక సాయంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు కెఎస్‌ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఇ.వెంకటరావు, ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, మరగడ రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఉచితంగా హిందీ పుస్తకాలు అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తిని అభినందించారు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని ఉక్కు ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన సుందరయ్య కాలనీలో మంగళవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలివి. సుందరయ్య కాలనీలో వీధిలోకి ఇసుక లోడుతో వెళుతున్న లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కనే ఉన్న జిరాక్స్ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడకు జిరాక్స్ తీసుకునేందుకు వచ్చిన వెంకటరమణ (58) అనే ఉక్కు ఉద్యోగిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. జిరాక్స్ దుకాణంలో ఉన్న యువతి అదే సమయంలో వేరే పనిమీద బయటకు వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకుంది.దీనిపై గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ కేసులో ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:నగరంలోని ఖస్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కూర్మన్నపాలెం వద్ద గత శుక్రవారం జరిగిన దోపిడీ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని నగర పోలీస్ కమిషనరేట్ అధికారులు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలివి, నగరంలోని ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న కర్రి మహేష్ ఈనెల 27న సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై తెలుగు తల్లి జంక్షన్ నుండి కూర్మన్నపాలెం ఆర్చివైపు వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి అతని వెనుక నుండి వెంబడించి, మెడపై కత్తి పెట్టి బెదిరించగా, మరొక వ్యక్తి మహేష్ మెడలోని గొలుసును లాక్కొన్నాడు. అనంతరం మరో నలుగురు వ్యక్తులు అక్కడికి చేరుకొని మహేష్‌ను పొదల్లోకి ఈడ్చుకెళ్ళి దాడికి పాల్పడి, అతని వద్ద ఫోన్‌పేలో ఉన్న రూ.7250లను తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు విచారణ చేపట్టిన పోలీసులు మజ్జి అజయ్, గేదెల చేతన్, నంబారు అజయ్, వల్లి రాజు, ఉసిరికి వాసుదేవరావు, వల్లి మహేంద్ర అనే ఆరుగురు యువకులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.ఐదువేల నగదు, సిల్వర్ చైన్, కత్తి, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రూ.4 లక్షల చోరీ సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసును పెందుర్తి క్రైం పోలీసులు చేధించారు. రూ.నాలుగు లక్షల విలువైన ఆభరణాలను, చోరీ సొత్తును రికవరీ చేశారు. ఇద్దరు పాత నేరస్తులతోసహాముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి వెస్ట్ క్రైం ఎసిపి డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు.

జివిఎంసి 94వ వార్డు పరిధిలోని పురుషోత్తపురానికి చెందిన నాగరత్నం అనే మహిళ గతనెల 7న హైదరాబాదు వెళ్లారు. ఈ నేపథ్యంలో తాళాలు వేసిన ఇంటిని గమనించిన దొంగలు ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలను దొంగతనం చేశారు. తిరిగొచ్చిన తర్వాత ఇంట్లో అంతా చిందరవందరగా ఉండడం, దొంగతనం జరిగి, బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించిన బాధితురాలు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. అందిన ఫిర్యాదు మేరకు ఈనెల 19న కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 30న సోమవారం గోశాల జంక్షన్ వద్ద చోరీకి పాల్పడిన నిందితుడు ఉమ్మిడి సతీష్‌ను పెందుర్తి క్రైం పోలీసులు చాకచక్యంగా పట్టుకోగా, అతనిని విచారించిన మీదట చోరీలో పాల్గొన్న మరో ఇద్దరు పాత నేరస్తులు ఎర్రపల్లి మూర్తి, షేక్ నజీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తమదైన రీతిలో విచారించిన పోలీసులు, వారి నుంచి రూ. 4 లక్షల విలువచేసే 118 గ్రాముల బంగారం, రెండు కేజీలు వెండి ఆభరణాలతోపాటు, 15 కిలోల ఇత్తడి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును చాకచక్యంగా చేధించినపెందుర్తి క్రైం సిఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ సూరిబాబు, ఇతర సిబ్బందిని ఎసిపి లక్ష్మణమూర్తి అభినందించారు.

అలరించిన విద్యార్థుల ఫుడ్ ఫెస్ట్



ఆహార పదార్థాల్లోని పోషకాలపై వివరిస్తున్న 'రామకృష్ణ' విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : కూర్మన్నపాలెం శ్రీరామకృష్ణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఫుడ్‌ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) గౌరవాధ్యక్షులు పి భాస్కరరావు, అధ్యక్షులు బి.శ్రీనివాసరావు ఫుడ్‌ఫెస్ట్‌ను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు ఆరోగ్యకరమైన వివిధ రకాల ఆహార పదార్థాలను రుచి, శుచిగా తయారు చేసి ప్రదర్శించారు. ఆయా పదార్థాల్లో ఉన్న విటమిన్లు, మినరల్స్ ఇతర పోషకాలపై తెలియజెప్పి, అవి ఆరోగ్యానికి ఎలా ఉపయోగ పడతాయో వివరించారు. జిప్సా గౌరవాధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతూ, ఆహారంతోనే ఆరోగ్యం ముడిపడి ఉందని, ఇంట్లో అమ్మ వండిన పదార్థాలే తినాలని, బయట ఆహారాన్ని, ముఖ్యంగా జంక్ ఫుడ్స్ దరిచేరనీయొద్దని హితవు పలికారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాంసాహారం కంటే శాఖాహారమే ఆరోగ్యానికి మంచిదన్నారు. స్కూల్ డైరెక్టర్స్ పి.వాసుదేవరావు, లలితకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు 80రకాల వివిధ వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కరెస్పాండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎంపిపి రాంబాబు, తదితరులు

ప్రజాశక్తి -పద్మనాభం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలు ఆకట్టుకున్నారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు రెండు యుపి పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఎ.బాలామణి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు 70 నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన ఆహూతులను వాటి గురించి వివరించారు.
సైన్స్ ఫెయిర్‌ను ఎంపిపి కె.రాంబాబు, ఎంఇఒ పి.రమణ పాల్గొని తిలకించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఉపాధ్యాయులు, పిడి నారాయణమ్మ పాల్గొన్నారు.

అపుస్మా జోన్-1 అధ్యక్షునిగా ఎంవి.రావు



ఎం.వి.రావు ను అభినందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపుస్మా) జోన్-1 అధ్యక్షుడిగా మల్లపురెడ్డి వెంకటరావు (ఎంవి.రావు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన అపుస్మా రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో విశాఖపట్నం ఆరిలోవ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్‌ను అపుస్మా జోన్-1అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు జోన్-1 పరిధిలోకి వస్తాయని ఎంవి.రావు తెలిపారు.

అధ్వాన రహదారితో అవస్థలపై
పెల్లుబికిన ప్రజాగ్రహం



ఎస్ఐకు, స్థానికులకు మధ్య వాగ్వాదం

- రోడ్డుపై బైఠాయించిన రెడ్డిపల్లి గ్రామస్తులు
- అధికారులు, నేతల నిర్లక్ష్యంపై నిరసన
- ప్రజాందోళనకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి-పద్మనాభం: రెండు జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ప్రధానరహదారి. అయితే పదేళ్లుగా కనీస నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో అధ్వానస్థితికి చేరుకోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నోసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా తట్టెడు మన్ను అయినా వేయని పరిస్థితుల్లో రెడ్డిపల్లి వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రజల ఆందోళనకు సిపిఎం సంఘీభావం తెలిపింది. వివరాలివి.

విజయనగరం, విశాఖ జిల్లాలకు ప్రధానమార్గంగా ఉన్న విజయనగరం, సింహాచలం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు, వాహనదారులు పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణసంకటంగా మారిన ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని, ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కొన్నాళ్లుగా ప్రజల తీవ్ర ఆవేదన, ఆందోళనతో ఉన్నారు.

దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రెడ్డిపల్లి మహిళలు రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అందరూ రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. రెడ్డిపల్లి రామాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి, నేతలు, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. మహిళల ఆందోళనకు గ్రామం లోని అన్ని పార్టీల



ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నేత నర్సింగరావు

పురుషులు, పిల్లలు మద్దతు ప్రకటించి, రోడ్డెక్కారు. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు ఆందోళనకు ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఆందోళనలో సిపిఎం భీమిలి జోన్ నాయకులు రవ్వా నర్సింగరావు పాల్గొని సంఘీభావం తెలిఆపరు.

సమాచారం అందుకున్న పద్మనాభం ఎస్ఐ సురేష్, ఆందోళన వద్దకు వెళ్లి, ప్రజలను వారించే ప్రయత్నం చేసినా ఎవరూ ససేమిరా వినలేదు. ఆందోళనకారుల పెద్దస్థాయిలో ఉండడంతో చేసేదేమీ లేక మిన్నకున్న పోలీసులు, సంబంధిత ఆర్అండ్‌బి అధికారులను సంప్రదించారు. ఆర్అండ్‌బి ఎఇ గంగరాజు స్పందించి ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడి, రోడ్డు మరమ్మతులు చేస్తామని హామీఇచ్చినా ఆందోళన విరమించేందుకు గ్రామస్తులు నిరాకరించారు.

సిపిఎం నాయకుడు నర్సింగరావుతోపాటు స్థానిక పెద్దలంతా సంప్రదించిన మీదట తక్షణమే విజయనగరం, సింహాచలం రహదారిలో గోతులకు మరమ్మతుల పనులు చేపట్టి, ఈనెల 20నాటికి పూర్తిచేస్తామని అధికారుల నుంచి స్పష్టమైన హామీ రావడంతో ఆందోళన చేస్తున్న మహిళలు, చిన్నారులు, రెడ్డిపల్లి గ్రామస్తులకు నచ్చజెప్పి, ఒక్కసారి అధికారులకు అవకాశమివ్వాలని చెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో దాదాపు మూడు గంటల ఆందోళన తర్వాత ఉదయం 11గంటలకు రాకపోకలకు అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా సిపిఎం నేత రవ్వ నర్సింగరావు మాట్లాడుతూ, అధికారులు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు మరమ్మతులు చేపట్టి, గోతులను పూడ్చుకుంటే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎంవి.శేషమ్మ

ప్రజాశక్తి -మధురవాడ : మత్తు వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, అనేక నేరాలకు మత్తు కూడా ఒక కారణమేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మంగళవారం పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మత్తు అనర్థాలు, దాని వల్ల కలిగే పరిణామాలు, నేరాలపై ప్రజల్లో అవగాహనకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎంవి .శేషమ్మ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలకు డబ్బులు అలవాటు చేయరాదన్నారు. పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, వారి స్నేహబంధాలు, వారి నడవడిక లపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు నేటితరం యువత అలవాటు పడడం దురదృష్టకరమన్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు తీసుకోవడం, వాటి రవాణా, అమ్మకాల్లో భాగస్వాములైతే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు. అసాంఘిక చర్యలపై ప్రజలంతా సంఘటితంగా పోలీసులకు సమాచారమిచ్చి, వాటి నియంత్రణకు సహకరించాలని కోరారు. నేటి పోటీప్రపంచంలో పిల్లలను దానికి అనుగుణంగా సన్నద్ధం చేయడంతో తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వివిధ కేసుల్లో కోర్టుకు వచ్చే కక్షిదారులు తాము న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకుంటే ప్రభుత్వం తరపున న్యాయసహాయాన్ని అందిస్తామన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆయా కేసుల్లో శిక్ష, జరిమానాలు కఠినంగా ఉన్నాయన్నారు.
నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు మాట్లాడుతూ సబ్ జోన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ, ఎస్ఐ సునీత, శ్యాంప్రసాద్ పలువురు విద్యార్థులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి



ఆరిలోవ పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సిపి

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం సాయంత్రం తనిఖీ చేసారు. నూతన భవనంలోకి వెళ్ళిన తరువాత మొదటిసారిగా సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీస్టేషన్‌ను సందర్శించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులను, ఫైళ్ళను తనిఖీ చేసారు.

పెండింగ్‌లో ఉన్న కేసుల విషయమై ఎసిపి అన్నెం నర్సింహమూర్తి, సిఐ మల్లేశ్వరరావుతో చర్చించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులకు దిశానిర్ధేశం చేసి, అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

92వ రోజుకు పోర్టు ఉద్యోగుల దీక్షలు



దీక్షలు కొనసాగిస్తున్న పోర్టు ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పిపిపి విధానంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేయాలన్న ప్రభుత్వ కుట్రలను వెంటనే మానుకోవాలని పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు విఎస్.పద్మనాభరావు డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తూ, సిఐటియు పోర్ట్ కార్మికసంఘాల సారథ్యంలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు మంగళవారం 92వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో పోర్టు ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందిస్తామన్న బూటకపు మాటలతో పోర్టు ఆసుపత్రిని ప్రయివేటకు కట్టబెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. పోర్టు కార్మికుల ఆందోళనతో టెండర్లు వేసేందుకు వెనకడుగు వేస్తున్నా, పిపిపి విధానంలో అప్పగింత నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కు రావడం లేదన్నారు. 40వేలమంది పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబీకుల ఆరోగ్యంతో ముడిపడి వున్న ఈ వ్యవహారంలో ప్రభుత్వం ముందుకు వెళ్లాలని చూస్తే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఉద్యోగులు, కార్మికుల శ్రమ, కృషితో వందల కోట్ల లాభాలను ఆర్జిస్తున్న విశాఖ పోర్టు ఇస్తున్న సిఎస్ఆర్ నిధులతో ఇతర సంస్థల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో, పోర్టు ఆసుపత్రిని ప్రయివేటు నిధులతో అభివృద్ధి చేస్తామనడం సిగ్గుచేటన్నారు. వైద్యనిపుణులను నియమించడంతోపాటు అవసరమైన మందులు, ఆధునిక వైద్యపరికరాలను పోర్టు సొంత నిధులతో సమకూర్చి, పోర్టు నిర్వహణలోనే గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కె సత్యనారాయణ, వి ఎన్ మూర్తి, కేస్ కుమార్, రాఘవులు, విజయకుమార్ నాయుడు ప్రభుదేవా, అన్నపూర్ణ, బాలకృష్ణ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మెరుగైన పోలీసింగ్‌తో నేరాలు తగ్గుదల

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో నేరాల తగ్గుదల అయిందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఈ మేరకు 2024వ సంవత్సరంలో అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతిపై మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు... అనకాపల్లి జిల్లా పోలీసులు పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోక్సో చట్టం, మహిళా చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పించాం. మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్ తదితర నేరాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నాం. అపహరించిన /పోగొట్టుకున్న మొబైల్ ఫోనుల కోసం ఫిర్యాదుదారులు పోలీసు స్టేషనుల చుట్టూ పదే పదే తిరగకుండా ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించి రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచాం. మొత్తం 8 విడతల్లో 2208 మొబైల్ ఫోన్లను (సుమారు విలువ రూ.2 కోట్ల 80 లక్షలు) ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేశాం. రహదారి భద్రతా చర్యల్లో భాగంగా 2024 సంవత్సరంలో 4332 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 12,282 కేసులు నమోదు చేశాం. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై 93,713 ఈ చలానాలు విధించాం. 696 కేసులు నమోదు కాగా 316 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా 26 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ఆయా ప్రదేశాలలో స్టాప్ బోర్డులు, ఫైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశాం.

2803 పిజిఆర్ఎస్, 464 సిసిసి పిటిషన్లు నమోదు కాగా వాటిని గడువు సమయంలో పరిష్కరించాం. డయల్ 100/ డయల్ 112/ వాట్సాప్/ పబ్లిక్ కాల్స్ ద్వారా 10,939 ఫిర్యాదులు రాగా వాటిలో 108 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. పోలీసుశాఖలో మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకొని లోన్ యాప్‌ల వలన జరిగే అనర్థాలు, ఇతర సైబరు నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, బాల్య వివాహాలు అరికట్టడం పట్ల వారి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం. గ్రామ స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ముందస్తు సమాచార సేకరణ, అసాంఘిక కార్యకలాపాలపై సమాచార సేకరణకు వారి సేవలను వినియోగిస్తున్నాం. 12,623 యువ కేసుల్లో ఈ సంవత్సరంలో 7,571 కేసులు నమోదు, 7,071 కేసులు దర్యాప్తు చేసి పరిష్కరించడం జరిగింది. గంజాయి స్వాధీనం, అక్రమ రవాణాపై 161 కేసులు నమోదు చేసి మొత్తం 7326.43 కిలోల గంజాయి, హషీష్ ఆయిల్ 4 లీటర్లు స్వాధీనం చేసుకున్నాం. గంజాయి అక్రమ రవాణా మార్గాలను అరికట్టేందుకు 5 శాశ్వత చెక్ పోస్ట్‌లను, 11 డైనమిక్ (సంచార తనిఖీ) చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశాం. 127 ఆస్తి సంబంధిత నేరాలు ఛేదించి రూ.1,96,83,090 విలువైన ఆస్తులను నేరస్తుల నుండి స్వాధీనం చేసుకున్నాం. 23 హత్య కేసుల నమోదు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై 4332 కేసులు నమోదు చేసి రూ.44,03,190 జరిమానా విధించాం. 4,618 కేసులు డిస్పోజ్ కాగా, వాటిలో 2,367 కేసుల్లో నిందితులకు శిక్షలు పడినట్లు చేశాం. సైబరు నేరాలు 103 కేసుల నమోదు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు ద్వారా దొంగతనాలు అరికట్టడం జరిగిందని ఎస్‌పి తెలిపారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2025 నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ సుఖశాంతులు కలుగజేయాలని, కుటుంబాలలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా సహాయం పొందుతున్న వర్గాలు వాటిని వినియోగించుకుని ఆర్థిక అభ్యున్నతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నూతన సంవత్సరం మరో మైలురాయి కావాలని ఆమె కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని లగిశెట్టిపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 5 అర్జీలు అందినట్లు స్థానిక తాసిల్దార్ బి.చిన్నకృష్ణ తెలిపారు. అర్జీలను దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అండిబోయిన బంగారయ్య, ఆడారి నాగరాజు, భూ రీసర్వే డిటి గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో అప్పలరాజు, విలేజ్ సర్వేయర్ రవితేజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.శివరాంపురం, అప్పం పాలెం గ్రామాల్లో స్థానిక సర్పంచ్ నమ్మి నీరజా అప్పలరాజు అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. తహాసిల్దార్ ఎం.లక్ష్మీ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసిల్దార్ లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దేవర తాతాజీ, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ఎన్ నరసాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజలు రెవిన్యూ పరమైన సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పురుషోత్తపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సదస్సుల్లో సమర్పించిన అర్జీలపై 40 రోజుల్లో పరిష్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌సి హేమలత, తహశీల్దార్ ఆనందకుమార్, కార్పొరేటర్ బల్లా శ్రీనివాస్, ఇతర అధికారులు, నేతలు పిల్లా జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో భీమరశెట్టి రాంకీ, పీలా గోవింద

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన మూడు రోజుల మంగళవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ భీమరశెట్టి రాంకీ మాట్లాడుతూ మంచి విజన్ ఉన్న కొణతాల రామకృష్ణ నియోజకవర్గానికే కాక, రాష్ట్రానికి చాలా అవసరమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, కాయలు మురళీధర్, ఉల్లింగల రమేష్, నైనముశెట్టి రమణరావు, బలిజి మూసిలినాయుడు, ఎస్‌కె బాబర్, చెట్టిపల్లి అప్పలనాయుడు, బుదిరెడ్డి గంగయ్య, మళ్ల బాబు, జెర్రిపోతుల నూకునాయుడు పాల్గొన్నారు.

గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- పర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఎం నేత బ్రహ్మాజీ

ప్రజాశక్తి -మునగపాక

గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక గడ్డవతల, పాటి దెబ్బ, పేట కట్టు, పురిటిగడ్డ తదితర ప్రాంతాలలో అకాల వర్షాలకు మునిగిన వరి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మునిగిపోయిన వరి పంటలను పరిశీలించేందుకు నేటి వరకు అధికారులు ఏ ఒక్కరూ రాలేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ నారు వేసిన దగ్గర నుండి వరి కోత దశకు వచ్చే వరకు అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాలలో నీరు వరి మడులలో చేరడంతో వరి పనలు మొక్కలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గ్రేడ్‌తో సంబంధం లేకుండా ధాన్యాన్ని సేకరించి అన్నదాతలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-సబ్బవరం

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, కరెంటు స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని ఎన్నికల ముందు టిడిపి కూటమి హామీ ఇచ్చిందని, స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నేతలు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దీనిపై హైకోర్టులో కేసు కూడా వేశారన్నారు. కాని నేడు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట తప్పి, కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.15,484 కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో భారం వేయడం దారుణమన్నారు. పాత మీటర్ల తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లను బిగిసుండడం ప్రజలను మోసగించడమే అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు కరెంట్ బిల్లు కట్టడానికి కొంత సమయం ఉండేదని, ఈ స్మార్ట్ మీటర్ల వల్ల బ్యాలెన్స్ అయిపోతే కరెంటు ఆగిపోతుందని, గృహాలు చీకటిమయం అయిపోతాయని తెలిపారు. అంతే కాకుండా ఈ స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చును సుమారు రూ.15 వేలు వినియోగదారుల కరెంటు బిల్లుతో నెలకు రూ.100 నుండి రూ.150 చొప్పున వాయిదాల రూపంలో ముక్కు పిండి వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బర్ల రమణ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కశింకోట : కరెంటు స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టును అదాని తదితర బడ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెట్టాయని, స్మార్ట్ మీటర్ల వల్ల ఎస్సీ ఎస్టీ వృత్తిదారులకు ఇచ్చే రాయితీలు క్రమంగా తొలగిస్తారని తెలిపారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి గతంలో వైసీపీ ప్రభుత్వం ఈ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టర్లు కుదుర్చుకొని అవినీతికి పాల్పడింది పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అవినీతి బాటలోనే నడుస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం మద్యాన్ని నిషేధించాలి : ఐద్వా

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మద్యపానం చెడు వ్యసనమని, దాని వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని, కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడతాయని పేర్కొన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు హాని కలిగించే ఈ మద్యాన్ని ప్రభుత్వాలు ఎక్కువ షాపుల్లోనూ విచ్చలవిడిగా అమ్మకం చేయడం దారుణమన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మద్యం మీద వ్యాపారం చేస్తూ ప్రభుత్వాలు పరిపాలించాల్సిన దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, దీనివల్ల దేశ పురోభివృద్ధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. మద్యం మత్తులో పసిపిల్లలపైనా, వృద్ధ మహిళలపైనా అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా నేటి ప్రభుత్వాలు మద్యపాన నిషేధాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హెరిటేజ్ పాడి రైతులకు బోనస్ విడుదల

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు సంక్రాంతి బోనస్ రెండు కోట్ల 67 లక్షల రూపాయలు డెయిరీ జోనల్ మేనేజర్ విదివాకర్ రావు చేతులమీదుగా అచ్యుతాపురంలో మంగళవారం విడుదల చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల వరకు ఆరు నెలల బోనస్ చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరీ మేనేజర్ కూండ్రపు శేషు, మేనేజర్లు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందేలా విద్యా బోధన ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : విద్యార్థులను ఎప్పటికప్పుడు సృజనాత్మకత పెంపొందేలా విద్యా బోధన ఉండాలని ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఐజి రాజశేఖర్ అన్నారు. ఉషోదయ డిగ్రీ కళాశాలలో ఉన్న బోధనా సిబ్బందితో నిర్వహించిన సదస్సులు ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రాథమిక విద్యను బోధించేటప్పుడు అనేక మెళుకువలు నేర్పుతారని, అదే మాధ్యమిక విద్య వచ్చేసరికి అటువంటి పోకడ లేకపోవడం వల్ల విద్యలో నాణ్యత తగ్గుతుందని తెలిపారు. అందువల్ల ప్రాథమిక విద్య మాదిరిగానే మాధ్యమిక విద్యా బోధన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల ఛైర్మన్ జె రమణాజీ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజి రాజశేఖర్



బహుమతి అందుకుంటున్న నర్సింగరావు

యోగా పోటీల్లో నర్సింగరావు ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : జార్ఖండ్ ధన్బాద్ క్రీడో వరల్డ్ స్కూల్లో ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో 43వ జాతీయ యోగాసాన ఛాంపియన్షిప్ 2024 పోటీలు డిసెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి అనకాపల్లి మండలం తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్కు చెందిన బుదిరెడ్డి నరసింగరావు 60 సంవత్సరాల విభాగంలో 4వ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నరసింగరావును గ్రామ నాయకులు కర్రి బాబీ, కర్రి జోగి నాయుడు, నడిపల్లి గణేష్, బూసి బాబు, అజయ్, చంటి సూరిబాబు శ్రీను తదితరులు అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-కశింకోట : మండల కేంద్రం కసింకోటలో ట్రాఫిక్ నియంత్రణకు మంగళవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కసింకోట రైల్వే స్టేషన్ రహదారి, కసింకోట ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహన చోదకులకు అసౌకర్యం కలగకుండా, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఆ పనులను సీఐ స్వామి నాయుడు ఎన్హెచ్ఏఐ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కసింకోట జంక్షన్ లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని సీఐ చెప్పారు. ప్రస్తుతం జంక్షన్కు దూరంగా డివైడర్ మధ్యలో దారి ఉందని, ఈ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామంలో డిసెంబర్ 28న జరిగిన అగ్ని ప్రమాదంలో పశువులు పాకలు దగ్ధమైన పాడి పశువులు కాలిపోయిన నేపథ్యంలో బాధిత రైతులు దేవుడమ్మ, గేదెల శ్రీనివాసరావుకు మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్రాజ్ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. బాధితులను పరామర్శించి ఓదార్చారు. ఇద్దరు బాధితులకు రూ.10,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కర్రి బాబు, ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనకరాజు, మామిడి బంగారునాయుడు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి, యర్రంశెట్టి రాము, ధన్నిరెడ్డి శ్రీను, కర్రి రాజు, పాల్గొన్నారు.

వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి సమీపంలో మంగళవారం వైఎస్ఆర్సిపి ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంపిపి బొద్దెపు గోవింద వైఎస్ఆర్సిపిలో చేరి 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్చేశారు. పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేసిన అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొల్లి త్రినాథ్, పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని స్కూల్ కమిటీ చైర్మన్ రాజబాబు ఉన్నారు మండలంలోని తామరబ్బ గిరిజన పంచాయతీ ఎంపీపీ స్కూల్ను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు సక్రమంగా పెడుతున్నది లేనిది పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం చేసే ముందు చేతులు కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శెట్టి మంగరాజు, హెచ్ఎం సుభాష్, శెట్టి అప్పలకొండ, ఉబ్బిటి రాజబాబు, కోసూరి చిన్నదేముడు, జన్మేటి రాజు, దాకమర్రి కన్నయ్య, కడారి దేవుడు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ రాజబాబు

లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ

ప్రైవేటుపరంపై సిఐటియు నిరసన ర్యాలీ

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఆటో మోటార్ కార్మికులకు భారంగా మారే లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ విధానాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం అచ్యుతాపురం జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ లైసెన్స్ విధానం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వలన ప్రజలకు రక్షణ కరువవుతుందని, అందువల్ల ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని తెలిపారు. ఈ విధానాలను మన రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అమలు చేయడం వల్ల ఆటో, మోటార్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఆటో కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో 4.లక్షలు రుణాలు మంజూరు చేస్తామని, ప్రతి ఒక్క ఆటో డ్రైవర్కు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, జీవో నెంబర్ 21ను రద్దు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆ వాగ్దానాలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. పైగా లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై టిడిపి కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని, అన్ని సంఘాల ఆటో కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఆటో స్టాండ్ నాయకులు కట్ట రాజు, చండి, రమేష్, రమణ, కోదండ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

కార్మిక సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : రవాణా రంగ కార్మికుల సమస్యలపై జనవరి 5న అనకాపల్లిలో జరుగు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పరవాడ ఆటో స్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా అఖిల భారత రోడ్ ట్రాన్స్పోర్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. డ్రైవర్లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, పెంటి బోయిన అప్పలరాజు, చిన్ని రమేష్, పి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టగలరా? లేదా?

- పోలీసులను ప్రశ్నించిన ఎమ్మెల్యే విజయ్కుమార్
- మున్సిపల్ కౌన్సిల్లో సుదీర్ఘ చర్చ

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో గంజాయిపై సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరయ్యారు. అప్పటికే గంజాయి వాడకంపై జరుగుతున్న చర్చలో ఎమ్మెల్యే కలుగజేసుకున్నారు. గంజాయి వాడకంతో పిల్లలు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి టౌన్, రూరల్ ఎస్ఐలను పిలిపించి గంజాయిని అరికట్టగలరా? లేదా? సూటిగా ప్రశ్నించారు. కేసులు పెడుతున్నామని చెప్పడం కాదు గంజాయిని అరికట్టలేకపోతే మరో యంత్రాంగాన్ని దింపుతానని సీరియస్ అయ్యారు. అంతలోనే అక్కడకి సర్కిల్ ఇన్స్పెక్టర్ చేరుకొని యలమంచిలిలో గంజా సౌండ్ వినిపిస్తున్న మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. అయితే గంజాయిపై తమకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు తమ ప్రాంతాల్లోని కొన్ని ప్రదేశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కారానికి కౌన్సిలర్లు, పోలీసులు చర్చించి ఒక విధానం ప్రకటించుకొని పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

మద్యం బెల్టుషాపులు అన్నిచోట్లా బహిరంగంగా వెలిశాయని కొందరు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బెల్టు షాపు నిర్వాహకులను నిర్దాక్షిణంగా శిక్షించాలని, ఒకవేళ ఒదిలేయమని తన పేరు చెబితే మరింత కఠినంగా శిక్షించాలని పోలీసులకు, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బెజవాడ, ఆరెపు గుప్తా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, తహశీల్దార్ వరహాలు, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, డిఇఇ, ఏఇ సుబ్బారావు, జలవనరుల శాఖ డిఇఇ, ఏఇ, ఎలక్ట్రికల్ ఏఇ కనకరాజు, పూర్తిస్థాయిలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ వన సమారాధన



సభ్యులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపిడబ్ల్యుజెఎఫ్ అనకాపల్లి ప్రెస్ క్లబ్ వన సమారాధన మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. అనకాపల్లి మండలం శ్రీపడమటమ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ సభ్యులందరూ సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్లబ్బు మాజీ అధ్యక్షులు మార్టూరు అజయ్ ఆలపించిన సినీ గేయాలు అలరించాయి. పలువురు సభ్యుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్లబ్బు అధ్యక్ష కార్యదర్శులు శశి, నాగ, కోశాధికారి గంగాధర్, బాషా, రమేష్, సురేష్, క్లబ్బు సభ్యులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-సబ్బవరం : పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీఓ పి.పద్మజ అన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.పద్మ, సిహెచ్.అప్పారావు ఎస్సై తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ కాలనీ సందర్శించి కోలనీ వాసులతో అధికారులు మాట్లాడి గ్రామంలో పౌరహక్కులు అమలవుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, బైలపూడి రాంబాబు, ఐనింటి రాజు, లైన్మెన్ నాయుడు, రాయవరపు శ్రీను పాల్గొన్నారు.

లేజర్ స్క్రీన్ థియేటర్ను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ఏర్పాటు చేస్తున్న లేజర్ స్క్రీన్ థియేటర్ సందర్శకులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్ల నాగభూషణం కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 జనవరి 15వ తేదీ కనుమపండుగ తీర్థము సందర్భంగా జరిగే 'మహా బౌద్ధ మేళా'ను పురస్కరించుకొని బుద్ధుని జీవిత చరిత్ర ఘట్టాలు, బొజ్జన్నకొండ చరిత్రలను తెలిపే లేజర్ స్క్రీన్ షో చిత్ర యూనిట్ ప్రదర్శనను అందుబాటులోకి తేవాలని కోరారు.

ఘనంగా గణిత మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్లో పాఠశాల స్థాయి గణిత మేళా మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడో తరగతి విద్యార్థులు మొదలుకొని పదో తరగతి విద్యార్థుల వరకు సుమారు 300 గణిత నమూనాలను (వర్కింగ్ మోడల్స్) తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గణిత మేధావి శాస్త్రజ్ఞుడు శ్రీనివాస్ రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్.ఎం. హెచ్.బి.శ్రీధర్ మాట్లాడుతూ గణితం అత్యంత ప్రాముఖ్యత కలిగిన సబ్జెక్ట్ అని, గణితంలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. తరువాత ఉత్తమ గణిత నమూనాలను ఎంపిక చేసి అవి తయారు చేసిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు బాబు, శైలజ, దయాసాగర్, సుబ్బారావు, ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయి, సుబ్రహ్మణ్యం, స్వామి, వసంతరావు, విజయలక్ష్మి, కరుణ జ్యోతి, పాల్గొన్నారు.

రోడ్లు మరమ్మతులు చేయాలని సిపిఐ నిరసన

ప్రజాశక్తి-చోడవరం : రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ అండ్ బి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దీనికి ముందు పట్టణంలో ర్యాలీ చేసి కొత్తూరు జంక్షన్లో మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్ అండ్ బి కార్యాలయానికి వెళ్లి అధికారులు లేకపోవడంతో కుర్చీకి వినతిపత్రం అంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గంలో ఆర్ అండ్ బి అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. రోడ్డు గోతుల వల్ల నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యుడు వెంటనే స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, భూసి పరమేశ్వరి, రాజాన దొరబాబు గొల్లి గురుబాబు, పాతాళ రాజు, కాసుబాబు, దేవుడుబాబు, కన్నబాబు, అప్పలనాయుడు, సిరికి నాయుడు, సన్యాసిరావు, ఫణీంద్ర, మురళి, బాబ్జి, దేవి, సన్యాసమ్మ, కల్పన, కుమారి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులచే నిత్యావసరాల విక్రయశాల

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ప్రాథమిక విద్యార్థుల తల్లిదండ్రులు భాస్యామ్యంతో చిన్నారుల చేత నిత్యావసర వస్తువుల విక్రయశాలను మంగళవారం ఏర్పాటు చేయించారు. పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ దీనిని ప్రారంభించారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తల్లిదండ్రులు గుర్తించ వలిసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. మూడు గంటల పాటు సాగిన ఈ మాల్లో తాజా పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్, పూలమొక్కలు, పిండివంటలు, పాలఉత్పత్తి పదార్థాలు, చిన్నారులు విక్రయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లీలా, అరుణ, ఉమా, శ్రీదేవిని, చిన్నారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్ అభినందించారు.

పార్టీలకు అతీతంగా నిధుల కేటాయింపు

-స్పీకర్ అయ్యన్న పాత్రుడు- మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ ఎక్స్ అఫిషియో సభ్యులుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ చైర్మన్‌తో పాటు కొంతమంది వైసిపి సభ్యులు సమావేశానికి గైర్హాజరు అయినప్పటికీ మెజార్టీ ఉండటంతో ఎక్స్ అఫీషియో సభ్యులు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరు వైసిపి సభ్యులు కూటమికి మద్దతు ఇచ్చారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జి.ఆదిలక్ష్మి, వైసిపి వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి ఈ సమావేశానికి హాజరయ్యారు. సభ ప్రారంభంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభ్యులు కాసేపు మౌనం పాటించారు. మన్మోహన్ సింగ్ సాధారణ జీవితం గడిపారని కొనియాడారు. ఈ సమావేశం జరిపించేందుకు కోరం ఉంటే చైర్మన్ లేకపోయినా మీటింగ్ నిర్వహించవచ్చు అని సమావేశం కొనసాగించారు. బడ్జెట్ ప్రకారం నిధులు వ్యయం చేయాలని మున్సిపాలిటీ నిధులను ఇష్టారాజ్యంగా రద్దు చేయడం మంచి పద్ధతి కాదు అని స్పీకర్ స్పష్టంచేశారు. దీనిపై ప్రభుత్వానికి రిపోర్టు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌కి ఆదేశించారు.మున్సిపాలిటీకి ఇప్పటివరకు రూ.14 కోట్ల 11లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని వార్డులకు నిధులను పార్టీలకు అతీతంగా కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.10కోట్లు మంజూరయ్యాయని సాధారణ నిధులు 4కోట్ల 11 లక్షలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో పనులు పూర్తి చేయాలని సూచించారు. 4కోట్ల 11లక్షలతో సిసి రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో మరో రూ. 5 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అన్ని వార్డుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పీకర్ అన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మరో ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. గతంలో చైర్ పర్సన్ గా పనిచేసిన గుదిబండి ఆదిలక్ష్మి, గొలుసు నరసింహమూర్తి సమావేశంలో హాజరయ్యారు. వైసీపీ పాలకవర్గం మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మితో సహా 14 మంది సభ్యులు సమావేశానికి డుమ్మా కొట్టారు. అనూహ్యంగా వైసీపీకి చెందిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొలుసు నరసింహమూర్తి సభకు హాజరై అయ్యన్న తీర్మానాలకు మద్దతు పలికారు.

చైర్‌పర్సన్ లేకుండా సమావేశం ఏర్పాటు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :మున్సిపల్ సమావేశం చైర్పర్సన్ లేకుండానే ఏర్పాటు చేయడం విశేషం. దీనిపై పట్టణంలో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. జరిగిన సమావేశంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు కోరం సరిపోతే సమావేశం ఏర్పాటు చేయవచ్చని తెలియజేశారు. ఈ సమావేశం ఏర్పాటుపై పలు విమర్శలకు దారితీస్తోంది. మునిసిపల్ బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర రూపొందించిన బడ్జెట్ ఎజెండా మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆమోదించి సమావేశం విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. సోమవారం రాత్రి సమావేశం వాయిదా వేయాలని కమిషనర్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి లేఖ రాశారు. టీడీపీ, వైసీపీలకు చెరో 14 మంది సభ్యులు ఉండడంతో సమావేశం నిర్వహణపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి అనూహ్యంగా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ అయ్యన్నపాత్రుడు చేత మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణం చేశారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఆ సమయంలో ఆయన 14 మంది సభ్యులు ఉండగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా తాను ఒక సభ్యుడునని తనతో 15 మంది ఉండగా కోరం సరిపోవడంతో సభ నిర్వహించవచ్చని తెలియజేశారు.

సంతాప దినాల్లో సమావేశాలా?

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై సంతాప దినాల సమయములో సభలు, సమావేశాలు ఎలా నిర్వహిస్తారని మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బులక్ష్మి తెలిపారు. మీడియాకు వీడియో విడుదల చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సమయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వద్దన్నా సమావేశం ఎలా పెడతారని మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, మన్మోహన్‌సింగ్ సంతాప దినాలు ఖచ్చితంగా పాటించాలని, ఎటువంటి వేడుకలు నిర్వహించవద్దని సాక్షాత్తు స్పీకర్ అయ్యన్న చెప్పారన్నారు. దీంతో తాను సమావేశం వాయిదా వేయమన్నాని చెప్పారు. మున్సిపల్ సమావేశం పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై ప్రజలే ఆలోచన చేయాలని కోరారు.



రక్తదాన శిబిరం ఏర్పాటుపై స్పీకర్ ప్రశంస

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం ఏటిగైరంపేట మాజీ సర్పంచ్ నల్లబెల్లి నూకరాజు మొదటి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నూకరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను స్పీకర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 26 మంది రక్తదానం చేశారు. స్పీకర్ మాట్లాడుతూ నూకరాజు తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పని చేసిన సీనియర్ నాయకుడు అని, వారి మరణం తీరనిది అని అన్నారు. మొదటి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సముచితమైన కార్యక్రమమని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ ఈ విధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం వల్ల అనేక ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, గ్రామ యువత, తెలుగుదేశం పార్టీ యువకులు, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీసెర్చ్ ప్రొఫెసర్

జాతీయ విద్యా విధానంపై సదస్సు

ప్రజాశక్తి- నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసేస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా విధానం-2020 పై అవగాహన అవగాహన సదస్సు నిర్వహించారు.వీపిఎం అకాడమీ అఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొఫెసర్ డీన్, థానే రిటైర్డ్ సైంటిస్ట్ హెూమీ బాబా సైన్స్ సెంటర్ (ముంబాయి) డాక్టర్ సుధాకర్ సి.అగార్కర్ పాల్గొని మాట్లాడారు. సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు, నిష్పాక్షికమైన, న్యాయబద్ధమైన సమాజాన్ని స్థాపించేందుకు జాతీయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యే మౌలికమైనదన్నారు.21వ శతాబ్దంలో జాతీయ విద్యావిధానం 2020 తొలి విద్యా విధానంగా చెప్పడం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థ మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా వుండాలని, అన్ని స్థాయిల్లో చురుకుతనం, తెలివి కలిగిన వారు భోదన వృత్తిలో ప్రవేశించే విధంగా వారి జీవనోపాధి, గౌరవం, స్వయం ప్రతిపత్తి లకు భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ఆర్ కె రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెక్కతో చెయ్యి, 2025 ప్రతిరూపం

ఆకట్టుకున్న కళారూపం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలములోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళ తో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికాడు. చేతితో 2025 వ అక్షరం పట్టుకున్నట్లు చెక్కతో చెక్కి తన సూక్ష్మ కలను ప్రదర్శించాడు.

కరస్పాండెన్స్ ఫలితాల్లో నవోదయ స్కూల్ సత్తా

ప్రిన్సిపాల్ చంద్రశేఖర పట్నాయక్

ప్రజాశక్తి -రావికమతం:కరస్పాండెన్స్ కోర్సుల్లో స్థానిక నవోదయ పబ్లిక్ స్కూల్ ప్రతిభను చాటింది. మండల కేంద్రంలో నవోదయ పబ్లిక్ స్కూల్ ద్వారా కరెస్పాండెన్స్ విద్యను అభ్యసించిన విద్యార్థులు నూరు శాతం విజయం సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 -24 ఏడాదికి సంబంధించి ఆంధ్ర యూనివర్సిటీలో బి.ఎ, బీ.కాం, బీ.ఎస్సీ కోర్సుల విద్యార్థులు 147 మంది ఫైనల్ ఇయర్ ఎగ్జామ్ వ్రాసి 147 మంది కూడా విజయం సాధించినట్లు తెలిపారు. వీరిలో బి.ఏ 38 మంది, బీ.కాం 22 మంది, బి.ఎస్సి 87 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూలు ద్వారా



వెళ్లిన 250 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించి పరీక్షలు రాయించడం జరుగుతుందన్నారు. తమ నవోదయ ఫ్యాకల్టీస్ కష్టపడి పనిచేయడంతో ఈ విజయానికి కారణమన్నారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు రెగ్యులర్ పాఠశాలతో పాటు, కరస్పాండెన్స్ కోర్సులలో కూడా అడ్మిషన్లు కల్పిస్తున్నామన్నారు.2024 -25 ఏడాదికి సంబంధించి బిఏ, బీకాం, బీఎస్సీ, కరస్పాండెంట్ ఎడ్యుకేషన్ అడ్మిషన్లు జనవరి 10వ తేదీతో ముగుస్తుందన్నారు.



ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆంజనేయ వాహనంపై వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలా చార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను ఆంజనేయ వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలోను వేయింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నైపుణ్యాభివృద్ధి పెంపునకు చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: ఉపాధి అవకాశాలు కోసం జిల్లా లో యువతకు నైపుణ్యాభివృద్ధి పెంచుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నైపుణ్య అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల పరిధిలో గల అన్ని యువజన శిక్షణ కేంద్రాల ద్వారా డిడియు జి కే వై పథకం ద్వారా రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను సీఎం కే వి వై పథకం కింద నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ సెంటర్స్ గా నమోదు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సంకల్ప్ పథకంలో భాగంగా అడల్సెంట్ గర్ల్స్, సరెండర్డ్ మావోయిస్టులకు టైలరింగ్ లాంటి ఉపాధి ఆధారిత శిక్షణలను అందించటానికి, వర్క్ ఫ్రమ్ హెూం ఉపాధి అవకాశాలు కల్పించడానికి గల అవకాశాలని అధ్యయనం చేయాలని సూచించారు. మూడు ఐటీడీఏల పరిధిలో మెగా జాబ్ మేళాలు నిర్వహించాలని, ప్రతి ఐటీడీఏ పరిధిలో స్కిల్ వర్క్ షాప్స్ నిర్వహించాలని ఐటీడీఏల ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హెూం అవకాశాలలో డిగ్రీ అర్హత కలిగిన వాలంటీర్లకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో జరిగే స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలపై పిఒలు సర్వే చేయాలని, నిరుద్యోగ యువతకు కావాల్సిన కోర్సులను స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలులో చేర్చాలని సూచించారు. ఐటీడీఏల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెల సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.రోహిణి, ఎల్డిఎం నాయుడు, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టి అబ్బాయ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బీస్ నంద్, జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా ఉపాధి కల్పనాదికారి ఎ. సంగీత, కమిటీ సభ్యులు, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, వర్చ్యువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు వి.అభిషేక్, కే.సింహాచలం, భరత్ పాల్గొన్నారు....



దుస్తులు ఇస్తున్న వర్గీస్

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలోని ధర్మవరం గ్రామంలో 400 మందికి నిరుపేదలకు చీరలు, రగ్గులు, తువ్వాలును జోష్ మిషన్ డైరెక్టర్, ఫాదర్ కే వర్గిస్ మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది 400 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ వర్గిస్ మాట్లాడుతూ, పేదలకు సేవలు చేయాలనే సంకల్పంతోనే ధర్మవరంలో జోష్ మిషన్ ఆస్పత్రి నిర్మించామని, ఇప్పటికే లక్ష మందికి పైగా పేదలకు పలు రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గత కొంత కాలంగా నిరుపేద కుటుంబాలకు దుస్తులు, నిత్యావసరాలు అందించడమే కాకుండా పలుచోట్ల పేదలకు చిన్నచిన్న గృహాలను కూడా ఉచితంగా నిర్మించి ఇచ్చామన్నారు.గిరిజన గ్రామాలలో ప్రతి ఏటా జోష్ మిషన్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఫాదర్ వర్గిష్ వివరించారు. ఈ కార్యక్రమంలో జోష్ మిషన్ ప్రతినిధి వసంత, విదేశీ ప్రతినిధులు క్రిస్టియానా, డేవిడ్ మార్టిన్, కేథరిన్, మేరీ, తెరిసా, ధర్మవరం ఉపసర్పంచ్ సింహాద్రి, కొత్తకోట ప్రతినిధి బుల్లిబాబు పాల్గొన్నారు.

ఎస్‌సి కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

-జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్

ప్రజాశక్తి.- విశాఖ కలెక్టరేట్:ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 7వరకు పొడిగిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. డిసెంబర్ 31తో గడువు ముగియనుండటంతో మరొక వారం రోజులు పొడిగిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఓపి విధి విధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జివో విడుదల చేసినట్లు తెలిపారు.ఈ మేరకు జనవరి 7 వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 11 వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 17న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.



ఆందోళన చేపడుతున్న గిరిజనులు

గోతులు పూడ్చాలని ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:సాగర పంచా యతీ ఆడపవలస రహదారిలో గుంతలు పూడ్చాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మంగళవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ, ఆంధ్ర, ఒడిశాకు ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయని చెప్పారు. అధికారులు స్పందించక పోవడంతో గతేడాది గ్రామస్థులందరూ కలిసి శ్రమదానంతో గుంతలను పూడ్చడం జరిగిందన్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి మరింత ప్రమాదకరంగా మారిందని చెప్పారు. ఇటీవల నాలుగు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడపవలస రహదారిని మరమ్మతు చేసి ప్రమదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- సిపిఎం నేతల నిరసన



నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్:పార్లమెంటు సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని నిరసిస్తూ, సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు సుబ్బారావు అధ్యక్షతన భానోజీనగర్, పరిసర ప్రాంతాలలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వై. రాజు మాట్లాడుతూ, హెూం మంత్రి హెూదాలో ఉన్న అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్ కే కాక భారత రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లు ఉన్నాయన్నారు. వెంటనే ప్రధానమంత్రి మోడీ జోక్యం చేసుకొని అమిత్ షాని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఇటువంటి వ్యాఖ్యలు సమైక్యతకు, భారత ప్రజల ఐక్యతకు విఘాతం కల్పించి,కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రేకెత్తించే ప్రమాదం ఉందన్నారు. ప్రజల దృష్టిని మళ్లించి బిజెపి సొంత ఎజెండా అయిన ప్రైవేటీకరణ పేరుతో ఈ దేశాన్ని అమ్మటానికి ప్రయత్నిస్తుందని విమర్శిం చారు.

మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. చంద్రశేఖరరావు మాట్లాడుతూ, కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు రేకెత్తించి, దేశ సంపదను విదేశీయాలకు తాకట్టు పెడుతున్నారని, ఇదేనా దేశభక్తి అని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు,కె. నర్సింగరావు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు

-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



పింఛన్ అందజేస్తున అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల మందికి పైగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం కొమిర గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంకు ఆయన హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో స్పీకర్ మాట్లాడుతూ ఈ పింఛన్ల పంపిణీకి గాను రూ.2700 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామాల అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం పింఛన్లు పెంచి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సెలవులు ఉంటే ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకే పూర్తిగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 2.58 లక్షల మందికి అనకాపల్లి జిల్లాలో పింఛన్లు పంపిణీ జరుగుతుండగా, వీటి మొత్తం పంపిణీకి 107 కోట్లు ఖర్చవుతుందన్నారు. గొలుగొండ మండలంలో 8,498 మందికి రూ.3.53 కోట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నాయకులంతా ప్రతి నెలా దగ్గరుండి పంపిణీ చేస్తే మరింత బావుంటుందని పేర్కొన్నారు. భర్త చనిపోయిన వెంటనే భార్యకు పింఛను మంజూరు చేసేలా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. తప్పుడు పింఛన్లు మంజూరును తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. అర్హత ఉన్నవారు ఎంతమంది ఉన్నా పింఛన్లు మంజూరు చేద్దామని తెలిపారు. కొమిరి గ్రామంలో సీసీ రోడ్లకు రూ. 20 లక్షలు, పాఠశాల ప్రహరీగోడకు రూ. 8 లక్షలు, స్మశానం అభివృద్ధికి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులకు సర్పంచ్ తీర్మానం ఇవ్వడం లేదన్నారు. ఆరు నెలల్లో గొలుగొండ మండలానికి 145 రోడ్లకు రూ. 7.11 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ప్రతి గ్రామానికి రూ. 20 నుంచి రూ. 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి.రమణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ కర్రి నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రత్యేకావసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని లోపాలు కనిపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని డిఇఒ పి.బ్రహ్మాజీరావు అన్నారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా కేంద్రంలోని తలారిసింగి జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలలో ఐఇ, ఎఎల్ఎస్ కో యాక్టివిటీస్ పై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిడబ్ల్యుఎస్ఎన్ పిల్లల పురోగతికి అందరూ పాటుపడాలన్నారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలన్నారు. స్టేట్ కన్సల్టెంట్ నరసింహారావు, రిసోర్స్ పర్సన్ మహాలక్ష్మి నాయుడు హాజరై ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్, ఎఎల్ఎస్ కో పై పూర్తి వివరాలను వివరించారు. సమగ్ర శిక్ష జిల్లా ఐఇ కోఆర్డినేటర్ కె.భాస్కరరావు మాట్లాడుతూ భవిత సెంటర్లలో సంబంధిత సిబ్బంది సిడబ్ల్యుఎస్ఎన్ పిల్లల నమోదు ప్రక్రియలో అలసత్వం వద్దని సూచించారు. సమగ్ర శిక్ష జిల్లా ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ కూర్మారావు మాట్లాడుతూ బడిబయట పిల్లలు, ఎన్ఆర్ఎస్ టికి సంబంధించి సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష జిల్లాకు సబంధించిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో బిసిల అభ్యున్నతి

పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:బిసిల ఉన్నతి కోసం పాటు పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే నని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఒక బిసిగా తనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని చెప్పారు. కాబినెట్ లో 50 శాతం బిసి లు మంత్రులు గా ఉన్నారన్నారు. టిక్కెట్లు ఇచ్చిన సందర్భంలో, శాసన సభ్యులు అయిన వారిలో 60 శాతం పైగా బిసిలకు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అని చెప్పారు. పార్టీ జిల్లా ఇంచార్జి లుగా కూడా బిసి లకు పట్టం కట్టిందన్నారు.వైసిపి ఐదేళ్లలో నాలుగు రీజినల్ కోర్డినేటర్లు వారి సామాజిక వర్గం వారినే పెట్టారన్నారు.అటువంటి వైసిపి నేతలు అవాకులు, చెవాకులు పలుకుతున్నారని ఆరోపించారు.వైసిపి పాలనలో బిసి నాయకులను అణగతొక్కే ప్రయత్నం చేశారన్నారు.కూటమి ప్రభుత్వం బిసి లకు రక్షణ చట్టం ప్రవేశ పెట్టిందన్నారు. మంత్రి పదవి కంటే రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు గొప్ప పదవి అన్నారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస విషయంలో తప్పుడు ప్రచారాలను స్వయంగా ఆయనే ఖండించారన్నారు.ఉచిత బస్ ప్రయాణం హామీ త్వరలో నిలబెట్టుకుంటామని తెలిపారు.కొత్త సంవత్సరం లో విశాఖలో ఆర్థిక ప్రగతి సాధించే రీతిలో నడుపుతామని చెప్పారు.చాలా మంది కూటమి లో చేరడానికి వస్తున్నారని,తమ మూడు పార్టీ లు మాట్లాడుకుని నిర్ణయాలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్,టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అత్యధిక మెజారిటీలు మన విశాఖ జిల్లా నుంచి నమోదు కావడం ఒక గొప్ప విషయం అన్నారు. అత్యధిక మెజారిటీ గాజువాక,భీమిలి, పెందుర్తి నియోజకవర్గాలు విశాఖ జిల్లాలోనే ఉండడం గొప్ప విషయం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.4 వేలు పెన్షన్ అమలు చేశారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు, లీగల్ సెల్ నాయకులు పతివాడ గిరిధర్, టిడిపి నాయకులు రాజమండ్రి నారాయణ, పొడుగు కుమార్, ఆరేటి మహేష్ పాల్గొన్నారు.